జెసిగా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ బాధ్యతలు స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న జెసి అహ్మద్‌ఖాన్

రాయచోటి : జాయింట్ కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. జిల్లాకు జెసిగా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, కలెక్టర్‌కు, జిల్లా ప్రజాప్ర తినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అప్పజెప్పిన విధులు, బాధ్యతలను వంద శాతం పూర్తి చేసేలా పనిచేస్తూ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ, రీ సర్వే పనులు, భూ సమస్యలు, పౌర సరఫరాలు, భూసేకరణ మొదలైన ప్రధాన అంశాలతో పాటు అన్ని శాఖలను పటిష్టం చేస్తూ వాటి ఫలాలను లబ్ధిదారులకు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అంతకుముందు నూతన జెసికి డిఆర్‌ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెట్ శ్రావణి, కలెక్టరేట్ వివిధ విభాగాల అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

అసైన్డ్ పందేరంపై గరంగరం

పండ్లతోటల పరిహారంపై వాగ్వాదం
పారదర్శకంగా అసైన్‌మెంట్ కమిటీలు : ఇన్‌ఛార్జి మంత్రి
ఆక్రమణలు పెచ్చుమీరిన గ్రామాల్లో స్పెషల్‌డ్రైవ్ : కలెక్టర్
పులివెందుల పాఠశాలల్లో మౌలిక వసతులపై నిలదీత
అన్నమయ్య నిర్వాసితులను ఆదుకోవాలి: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అసైన్డ్ భూముల పందేరంపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గరంగరంగా నడిచింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని 10 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల్లో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు సి.రామచంద్రయ్య, పి.రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, రామగోపాల్‌రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలు, ఎంపీలు గైర్హాజరు కావడం గమనార్హం. జిల్లా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల ప్రస్తావన మొక్కుబడిగానే సాగిం దని చెప్పుకోవచ్చు.

జిల్లాకు వ్యవసాయమే ప్రాణాధారం. ఇంతటి ప్రాధాన్యత కలి గిన రంగానికి ఇవ్వాల్సినంత ప్రాధాన్యత ఇవ్వలేదనే చెప్పవచ్చు. 10 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. పంటల సాగుకు విత్త నాలు, ఎరువులు, పురుగు మందుల లభ్యత, సరఫరా వంటి అంశాలపై లోతుగా చర్చించాల్సి ఉంది. టిడిపి ఎంఎల్‌సి రామగోపాల్‌రెడ్డి, ఎంఎల్‌ఎ రవీంద్రనాథరెడ్డి పంటల బీమా, అకాల వర్షం భారిన పడిన పండ్లతోటల నష్టపరిహారం విషయంలో వాగ్వా దం మినహా ఎటువంటి లోతైన చర్చను చేపట్టకపోవడం విస్మ యాన్ని కలిగించింది. ఎమ్మెల్సీ స్పందించి ఆదివారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి దెబ్బతిన్న పండ్ల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, సత్వరమే పరిహారాన్ని అందిం చాలని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద విత్తనం వెంటనే నష్టం వాటిల్లితే 25 శాతం పరిహారం లభించే అవకాశం ఉందని, వైఎస్ఆర్ పంటల బీమా పథకం అమలుతో అటువంటి అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తీర్ణతశాతం అద్వా నంగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. నాడూ-నేడు పథకం గురించి గొప్పలు చెబుతున్నారని, పులివెందులకు చెందిన

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పాఠ శాలలో మూడు దశల నాడు-నేడు మౌలిక వసతులు కల్పించడం లోనే డొల్లతనం వెల్లడవుతోందని విమర్శించారు. దీనికి ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ జోక్యం చేసుకుని ఎమ్మెల్సీ సూచించిన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ నిచ్చారు. బి. ః మఠంలోని జూనియర్ కళాశాలను ఎల్ఎస్‌పి దగ్గర ఏర్పాటు చేయ డం ద్వారా 40 మంది విద్యార్థులకు భారంగా మారిందని, జూని యర్ కళాశాలను మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని బి.మఠం జడ్‌పిటిసి వివరించారు. దీనికి కలెక్టర్ విజయ్‌రామరాజు స్పందించి గతంలో ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో మార్చాల్సి వచ్చిందని, ఇటువంటి ఘటనలు పునరావృతం గాకుండా చూస్తా మని హామీనిస్తే పునరుద్ధరించే ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం అసైన్‌మెంట్ కమిటీల్లో అర్హులకు తగిన స్థానం దక్కలేదని, 419 మంది అర్హుల పేర్లను పరిశీలించాలని చక్రాయపేట జడ్‌పిటిసి సభ దృష్టికి తీసుకొచ్చారు. బి.మఠం ఎంపిపి, జడ్‌పిటిసిలు స్పందించి తమ మండలంలోనూ ఇటువంటి ఘటనలు పెచ్చుమీరాయని, అసైన్‌మెంట్ కమిటీని రద్దు చేయాలని, టిడిపి హయాంలో ఒక్కో ఇంట్లో పిల్లల పేర్లతో కలిపి 20 ఎకరాలను ఇచ్చారని, ఇటువంటి వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వీరితోపాటు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి స్పందించి తమ అసెంబ్లీ పరిధిలోని వీరపునాయునిపల్లి మండలంలోనూ ఇటువంటి అక్రమ ణలు ఉన్నాయని సభ దృష్టికి తెచ్చారు. దీనికి కలెక్టర్ జోక్యం చేసు కుని బి.మఠం, వీరపునాయునిపల్లి మండలాల నుంచే ఎక్కువగా భూ ఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయని, భూసమస్యల పరిష్కా రానికి స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేసి పరిష్కరించే ప్రయత్నం చేస్తా మని, దీంతోపాటు నియో జకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాల్ని ఏర్పాటు చేసి సుమారు 28 వేల చుక్కల భూముల అర్హత పత్రాలను అంద జేస్తామని హామీనిచ్చారు. ఆర్‌బికె సెంటర్లలో సోషల్ ఆడిట్‌కు ఉం చుతామని తెలిపారు. దీనికిపై ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ స్పందించి అసైన్ మెంట్ కమిటీలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. భూమి మీద ఉన్న వారికే యాజమాన్య హక్కులు వస్తా యని చెప్పారు. భూముల సాగుకు సంబంధించిన పైపులు, పం పులు, పట్టల కాంట్రాక్టును జిల్లాలోని ఆరు కంపెనీలను కాదని, ఆళ్ల గడ్డకు చెందిన వికె ఆగ్రో సంస్థ నాసిరకమైన కంపెనీ అని, కాంట్రా క్టును రద్దు చేసి నాణ్యమైన కంపెనీకి ఇవ్వాలని వివిఎన్‌పల్లి జడ్‌పిటిసి డిమాండ్ చేశారు. దీనికి డ్వామా పీడీ స్పందించి నాణ్యమైన ఉత్ప త్తులను అందించే ఏర్పాట్లు చేస్తామని హామీనిచ్చారు. అనంతరం కలెక్టర్ జోక్యం చేసుకుని జిల్లా ఆడిట్ టీమ్ ద్వారా నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడకుండా చూడాలని ఆదేశించడం గమనార్హం.

సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

'కేతు' మరణం సాహితీ లోకానికి తీరని లోటు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ కథా రచయిత రాయలసీమ కథారత్న ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సోమవారం తెల్లవారు జామున 5.30 గంటలకు ఒంగోలులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో గుండ పోటుతో హఠాన్మరణం చెందారు. తెలుగు సాహిత్యంలో కథకునిగా, విద్యావేత్తగా, పరిశోధకునిగా నిరంతర సృజనశీలిగా సుప్రసిద్ధులైన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి 1939, జులై 10న కడప జిల్లా, కమలాపురం తాలూకా, రంగసాయిపురంలో కేతు వెంకటరెడ్డి, నాగమ్మ దంపతులకు జన్మించారు. జి.ఎన్.రెడ్డి. పర్యవేక్షణలో కడప జిల్లా గ్రామ నామాలు అనే అంశం మీద పరిధోధన చేసి డాక్టరేట్ పొందారు. ఆయన మొదటి నుంచి తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి శాస్త్రీయ దృక్పథంతో మానవ సంబంధాలను విశ్లేషించి రచనలు చేశారు. విశ్వనాథరెడ్డి జిల్లా, గ్రామ నామాలపై లోతైన పరిశోధన చేసి విశిష్టమైన పంథాలో పరిశోధన చేశారు. గ్రామ నామాలను, ఆ గ్రామాల జీవిన విధానాన్ని, ఆచార వ్యవహారాలను, ఆర్థిక అసమానతలను పరిశీలించి వెలువరించిన అధ్యయన ఫలితాలు ప్రశంసనీయం, ఈ పరిశోధన తరువాత తరాలవారికి మార్గదర్శకమైన అనేక నిఘంటువుల రూపకల్పనకు దారితీసింది. ఆయన హఠాన్మరణం జిల్లాలోని సాహితీ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మృతి సందర్భంగా పలువురు సంతాపం తెలిపారు. కేతు విశ్వనాథ్‌రెడ్డి మృతి పట్ల సి.పి.బ్రౌన్ భాష పరిశోధన కేంద్రం సంచాలకులు మూల మల్లికార్జునరెడ్డి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. కురువృద్ధులు, రాయలసీమ కథకు చిరునామా కేతు విశ్వనాథరెడ్డి మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటని సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ బండి లెనిన్ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి అన్నారు. కేతు సాహితీలోకానికి తీరని లోటని సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఎస్‌సిఇఆర్‌టి సంపాదకుడుగా వ్యవహరించారని తెలిపారు. కేతు మరణం బాధాకరమని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. వారి కుటుంబం సభ్యులకు ప్రగాఢ

గత ఏడాది జూన్ 18న కడపలో నిర్వహించిన ఎంహెచ్ అవార్డు ప్రదానోత్సవంలో కేతు విశ్వనాథరెడ్డిని సన్మానిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది (ఫైల్‌ఫొటో)

సానుభూతి తెలిపారు. శ్రామిక జనపక్షపాతి కేతు మరణం బాధకరమని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు.

నేడు కడపకు 'కేతు' పార్థివదేహం

కేతు విశ్వనాథరెడ్డి పార్థివదేహం ఒంగోలులోని కూతురు ఇంటి నుంచి మంగళవారం మధ్యాహ్నం కడపకు తీసుకువస్తారు. సింగపూర్ టౌన్‌షిప్‌లోని ఆయన సొంత ఇల్లు 'అపేక్ష' వద్ద అభిమానుల సందర్శన కోసం ఉంచుతారు. అమెరికాలో ఉన్న ఆయన కుమారుడు, కుమార్తెలు మంగళవారం అక్కడి నుంచి బయలుదేరి బుధవారం కడప చేరుకుంటారు. అదేరోజు కేతు సొంతూరు రంగశాయిపురం (ఎర్రగుంట్ల మండలం) తీసుకుపోతారు. మధ్యాహ్నం లేదా సాయంత్రం దహన సంస్కారాలు ఉంటాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు. కేతు సతీమణి పద్మావతమ్మ ఆదివారం ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన పరీక్షలు కొనసాగుతున్నాయి. కూతురు అమ్మవద్దే ఉంది. కేతు, ఆయన అల్లుడు ఆదివారం రాత్రి ఇంటిలోనే ఉన్నారు. సోమవారం తెల్లవారు జాములన కేతు అల్లుడిని లేపి ఊపిరాడడం కష్టంగా ఉందని చెప్పారు. వెంటనే ఆయనను ఆదే సంఘంమిత్ర ఆసుపత్రికి తీసుకువెళ్లారు. డాక్టర్లు కేతును వెంటిలేటర్ మీదకు చేర్చే సరికే ఆ సాహితీ వటవృక్షం వేలాడిపోయింది. ఆదే ఆసుపత్రిలో గుండె పరీక్షలు చేసుకుంటున్న పద్మావతమ్మకి తెలిస్తే ఆమెకేమవుతుందోనని ఇంత వరకు భర్త మరణ వార్తను తెలియకుండా దాచాల్సి రావడం ఇంకో విషాదం.

'ఉపాధి'కి బడ్జెట్ సవరించి నిధులు పెంచాలి

- ధర్నాలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఉపాధి హామీ చట్టం కోసం కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జయరామయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఉపాధి పని ప్రదేశాల్లో పర్యటనలు నిర్వహించి కూలీలతో చర్చించి సమస్యలు తెలుసుకున్నామని వివరించారు. ఉపాధి పనుల్లో ఫోటో హాజరు వల్ల కూలీలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గతంలో ఉన్న మౌలిక సదుపాయాలైన టెంటు సౌకర్యం, మంచినీళ్లు, మజ్జిగ, మెడికల్, బీమా పథకం, పనిముట్లు, సమ్మర్ అలవెన్సు, మేటీలకు అలవెన్స్ లాంటివి ఏమీ లేకుండా చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. కూలీలు పనిచేసే చోట సౌకర్యం లేకపోవడంతో ఎండ దెబ్బకు అక్కడికక్కడే మరణిస్తున్నా పాలకులు స్పందించక పోవడం శోచనీయమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తక్కువ బడ్జెట్ కేటాయించి గ్రామీణ పేదలకు చట్టాన్ని దూరం చేసే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధి కూలీల ఉసురు తీస్తున్న బిజెపి ప్రభు త్వానికి పతనం తప్పదన్నారు. నిధులు కేటాయించని పక్షంలో కూలీలతో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, నాయకులు ఓబులమ్మ సంఘీభావం తెలిపారు. అనంతరం రెండు పూటల పని రద్దు చేయాలని, సమ్మర్ అలవెన్సు కొనసాగించాలని, కుటుంబానికి 200 పనిదినాలు, రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, ఉపాధి హామీని పట్టణ ప్రాంతాల్లో కూడా అమలు చేయాలని కోరుతూ డిఆర్‌ఒ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ డ్వామా పీడీతో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సురేంద్రరెడ్డి, నరసింహ, రామచంద్ర, వర్మ, శివయ్య, పెంచులయ్య, రమేష్ బాబు పాల్గొన్నారు.

మునిగోపాలకృష్ణను సన్మానిస్తున్న కళావేదిక సభ్యులు

సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి కృషి చేస్తున్న మదనపల్లి పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్.ముని గోపాలకృష్ణకు అరుదైన గౌరవం లభించింది. ఆయన సేవలను గుర్తిస్తూ కర్నూలు నగరానికి చెందిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో భాగంగా జ్ఞాపికను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ఎన్.మునిగోపాలకృష్ణ నిర్విరామ కృషి చేస్తున్నారన్నారు. ఈ వయసులోనూ ఆయన, ఆయన సతీమణి ధనలక్ష్మిలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. మునిగోపాలకృష్ణకు జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించిందన్నారు. అనంతరం ఎన్.మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ ఇంతటి అద్భుత కార్యక్రమానికి హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి ప్రముఖ కవులు విచ్చేసి తమ అభిప్రాయాలను పంచుకోవడం జరిగిందన్నారు. తనను సన్మానించిన శ్రీశ్రీ కళా వేదిక సంస్థ చైర్మన్ కత్రిమండ ప్రతాప్, సంస్థ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు.

ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ దండాల రవిచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, మదనపల్లి 14వ వార్డు మునిసిపల్ కౌన్సిలర్ షేక్ షబానా, ఉర్దూ అకాడమీ ఉపాధ్యాయుడు ఖజా మొహిద్దీన్లు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తంబళ్లపల్లి నియోజకవర్గం కేంద్రంలో ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి పూలమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరీముల్లా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని నెలకొన్న మైనారిటీల సమస్యలు, మసీదుల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై సహకరించాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మసీదుల అభివ ృద్ధికి తనవంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అంతేకాకుండా ముస్లిం మైనారిటీల అభివ ృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు,అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు చెప్పారు.ఇరిగేషన్ డైరెక్టర్ దండాల రవిచంద్రరెడ్డి మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రైతులు పక్షపాత ప్రభుత్వంగా ఇరిగేషన్ పనులు,మరమ్మత్తులకు ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుదాం

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సమిష్టి కృషితో రాయచోటిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్ద దామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష అధ్యక్షతన సోమవారం జరిగిన రాయచోటి మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికలలుతో మున్సిపాలిటీ అభివృద్ధికి మున్సిపల్ పాలక వర్గం కృషి చేద్దామన్నారు. అత్యవసర పనులకు, పారిశుధ్యం మెరుగుదలకు, సుందరమైన రహదారుల నిర్మాణాలకు ,పట్టణ సుందరీకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. రూ.8.17 కోట్ల మున్సిపల్ సాధారణ నిధులతో ఏక కాలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమన్నారు. రూ.1.40 కోట్ల నిధులతో చేపట్టిన మున్సిపల్ సభాభవన నిర్మాణపు పనులను ఆగస్టులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డైట్ హాస్టల్ ప్రాంగణంలో చేపట్టిన పార్కుల నిర్మాణం, వాకింగ్ ట్రాక్ తదితర పనులు రోల్ మోడల్ గా నిలవాలని ఆకాంక్షించారు. రూ.1.50 కోట్ల నిధులతో శిల్పారామం పనులు వచ్చే నెలలో ప్రారంభమవుతాయన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష మాట్లాడుతూ కౌన్సిలర్లు, అధికారుల సమన్వయంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు పెట్టిద్దామన్నారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించేలా, పారిశుద్ధ్యపు సిబ్బంది ఖచ్చితంగా విధులు చేసేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, తహశీల్దార్ ప్రేమ్‌కుమార్, సభ్యులు పోలంరెడ్డి విజయ, మదన మోహన్‌రెడ్డి, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, అల్తాఫ్, కొలిమి హారూన్ బాష, సాదక్ అలీ, ఫయాజ్ అహమ్మద్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా సోమవారం జనవి జ్ఞాన వేదిక ఆధ్వ ర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ మన దేశంలో జీవవై విధ్యంపై ఆధారపడి 60 శాతం మంది బతుకు తున్నట్లు ఒక అంచనా ఉందన్నారు. మనం ప్రకృతిని అవసరానికి మించి వాడటం గాని, వనరుల్ని దుర్వినియోగం చేయడం గాని, వికృతమైన జీవన విధానం అవలంభించడం గాని వదిలివేయాలని, మనిషి జీవనశైలిని ప్రకృతికి అనుగుణంగా మార్చుకోవాలని, రసాయనాల వాడకం తగ్గించి జంతువులను, మొక్కలను పరిరక్షించుకొని జీవవైవిధ్యాలను కాపాడుకోవాలన్నారు. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవ వైవిధ్యాన్ని భారీగా దెబ్బతీస్తోందన్నారు. మనవంతు బాధ్యతగా రసాయన కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించడం, జంతువులను, మొక్కలను పరిరక్షించడం, ప్లాస్టిక్ వడకాన్ని తగ్గించి జనపనార సంతులను వాడటం చేయాలన్నారు. అడవులు, జీవ, జల రాశులను ఇప్పటికైనా పరిరక్షించుకోనట్లయితే రాబోయే రోజుల్లో మానవజాతి మనుగడకే ముప్పు తప్పదని, అంతరిస్తున్న జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం మన అందరి బాధ్యత అని తెలిపారు.

పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్న కేశవరెడ్డి

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రభుత్వం 75 శాతం రాయితీపై అందిస్తున్న పశుగ్రాస విత్తనాలను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉపసర్పంచ్ కేశవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో వాల్మీకిపురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు ఉప సర్పంచ్ కేశవ రెడ్డి చేతులమీదుగా పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యశాల సహాయ సంచాలకులు నీరజ మాట్లాడుతూ రైతులు వారి పంట పొలాల్లో ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న మొక్కజొన్న, జొన్న, ఉలవలు, సజ్జలు వేసుకోవాలని సూచించారు. కిలో రూ.68 ఉండగా సబ్సిడీ పోనూ రూ.17 ప్రభుత్వం అందిస్తుందన్నారు. గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రఘు, కుమార్, వెంకట్రమణ రెడ్డి, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురం సిఐగా కృష్ణయ్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సిఐగా బాధ్యతలు చేపట్టిన కృష్ణయ్య

వాల్మీకిపురం సిఐగా కృష్ణయ్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు, ఇన్సూరెన్స్, వాహన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైన ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి, త్వరతిగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బిసిలను నమ్మించి మోసం చేసిన సిఎం జగన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసిలను అన్నివిధాలా అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని, బిసిలను నమ్మించి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యలయంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ అధ్యక్షతన రాజంపేట పార్లమెంట్ బిసి విభాగం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దొమ్మల పాటి రమేష్, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి, జోన్-4 కో-ఆర్డినేటర్ తాడిబోయిన చంద్రశేఖర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి పర్వీన్ తాజ్, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధులు గుత్తి కొండ త్యాగరాజు, వల్లిగట్ల వెంకటరమణ, తులసిదర్ నాయుడు, నియోజకవర్గం అధ్యక్షులు ముసలికుంట నాగయ్య, పట్టణ అధ్యక్షులు భవానీ ప్రసాద్, జనార్దన్, నీలకంఠ, రామ్మూర్తి, గాండ్ల వెంకటరమణ, జ్ఞానమూర్తితో పాటు పలువురు హాజరైయ్యారు. ఈ సందర్భంగా దొమ్మలపాటి రమేష్ మాట్లాడుతూ టిడిపి అంటేనే బిసిల పార్టీని ప్రకటించారు. 2019 ఎన్నికల్లో జగన్ చేసిన జిమ్మిక్కులు, కులాల మధ్య సంఘర్షణ వచ్చి బిసిల ఓటు బ్యాంకు చీలి, వైసిపి గెలుపుకు కారణమైందని వెల్లడించారు. బిసిలకు ఏమి చేయకపోగా 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి కనీసం వారు కూర్చోవడానికి కుర్చీలు, కార్యాలయాలు లేకుండా చేశారని విమర్శించారు. కేవలం మొక్కుబడిగా పదవులు ఇచ్చారు గాని నిధులు గాని, గౌరవం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అధికార పార్టీకి చెందిన 60 మంది ఎమ్మెల్యేలు టిడిపిలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. బిసిలు ఎవరు తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన ఆహ్వానించడానికి అందరూ సిద్ధమని ప్రకటించారు. వైసిపి హామీలకు మోసపోయిన బిసి లంతా టిడిపిలోకి రావాలని, రావాల్సిన అవసరం ఉందని పిలుప నిచ్చారు. చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజా సంక్షే మాన్ని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పర్వీన్ తాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. పి.సురేంద్ర యాదవ్ మాట్లాడుతూ టిడిపి బిసి విభాగం బలోపే తానికి గ్రామ స్థాయి నుండి పార్లమెంటు స్థాయి వరకు పూర్తిస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకడతామన్నారు.

జెవికె కిట్ లోని వస్తువులను ప్రదర్శిస్తున్న ఎంఇఒ రాజగోపాల్

జెవికె వస్తువుల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వస్తువుల నాణ్యతను పరిశీలించి ప్రదర్శించినట్లు ఎంఇఒ రాజగోపాల్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా కానుక ద్వారా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందించుటానికి క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు పంపిన వస్తువుల నాణ్యతను పరిశీలించి ఎంఇఒ కార్యాలయం వద్ద ప్రదర్శించినట్లు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం గాను మండలంలోని 3256 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా ఏడు రకాల వస్తువులను అందించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి మూడు జతల యూనిఫామ్ బట్టలు, షూలు, బెల్టు, బ్యాగు, టెక్స్ట్ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ వంటివి అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 36వేల పుస్తకాలు గాను 13వేల పుస్తకాలు వచ్చాయని, మరో కొన్ని వస్తువులు ఇంకా రావాల్సి ఉందని అన్నారు. విద్యార్థులకు జేవీకే కిట్ ద్వారా అందిస్తున్న వస్తువులు మంచి నాణ్యత ప్రమాణాలు కలిగి ఉన్నాయని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర అధికారులు జేవికె కిట్లు లోని వస్తువులను పరిశీలించుకోవచ్చునని ఎంఇఒ కార్యాలయం వద్ద ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, నాణ్యమైన విద్య, నాణ్యత కూడిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసించవచ్చని, ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలను ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీ ఉపాధ్యాయులు రామమోహన్, సిఆర్పిలు సుధాకర, పద్మనాభం, మంజుల, స్వాతి, నరసింహులు, సౌజన్య, అటెండర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడంలో ఆనందం ఉంటుందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు పేర్కొన్నారు. తన తల్లి పోతుగుంట లక్ష్మమ్మ నాలుగవ వర్ధంతి సందర్భంగా సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ కూడలిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెట్టడంలోనే ఆత్మసంతృప్తి ఉంటుందని తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై.సుబ్రహ్మణ్యం రాజు, రీజన్ చైర్మన్ షేక్ అబ్బుల్, మాజీ రీజన్ చైర్మన్ ఎం.రామకృష్ణ నాయుడు, పిడికిటి నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు ఏ.వెంకటసుబ్బయ్య నాయుడు, లయన్స్ క్లబ్ సభ్యులు పి.చంద్ర, జికె.నాగరాజు, తోటనగేష్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా ధనుంజయులు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు తహశీల్దార్‌గా కె.ధనుంజయులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బి. కొత్తకోట తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పీలేరు తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ పదవీ నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ధనుంజయులు

బి.కొత్తకోట తహశీల్దార్‌గా రఫిక్ అహ్మద్..

బి.కొత్తకోట : మండలం నూతన తహశీల్దార్‌గా రఫిక్ అహ్మద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రాయచోటి ఆర్‌డిఒ కార్యాలయం నుంచి పనిచేస్తున్న ఆయనను బి.కొత్తకోట తహశీల్దార్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ గిరీష ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రతి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధిలో భాగస్వామ్యమినవుతానన్నారు.

బాధ్యతలు చేపడుతున్న రఫిక్ అహ్మద్

మామిడి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలో ఆదివారం గాలివాన భీభత్సవంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు దగ్గరికి వచ్చి నష్టపరిహారాన్ని అందించాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు అంకన్న, చంద్రమౌళి, ఆదినారాయణ, శంకర్, చంద్రశేఖర్, స్వరూప్ తేజ డిమాండ్ చేశారు. పువ్వాళ్ళ శ్రీరామరెడ్డి స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎకరాకు రూ.50 వేల నష్టపోయిన ప్రతి రైతు కుటుంబానికి పరిహారం చెల్లించాలని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, అనిల్, మహేష్, అరుణ్‌తేజ్, కార్తీక్, ధనుష్, వరలక్ష్మి, ప్రతిమా, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ జొన్నలు పంపిణీ

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని పశు వైద్యశాల నందు ఎంపిపి కుసుమకుమారి ఆధ్వర్యంలో జొన్నలు, మొక్కజొన్నలు సబ్సిడీ ద్వారా మండల రైతులకు పంపిణీ చేసినట్లు పశు వైద్యాధికారి దివ్య తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు జొన్న, మొక్కజొన్నలు పంపిణీ చేయడం జరిగింది. ప్రతి రైతు పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్‌ను మీ పరిధిలోని రైతుభరోసా కేంద్రం లో తీసుకెళ్లి మీ పేరును నమోదు చేయించి సబ్సిడీ ద్వారా జొన్న, మొక్కజొన్నలు పొందాలని ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్‌బాబు, జడ్‌పిటిసి సిహెచ్.రామచంద్రారెడ్డి, కన్వీనర్ భాస్కర్‌గౌడ్, పాడి రైతులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ జొన్నలను పంపిణీ చేస్తున్న ఎంపిపి

రైతులను నట్టేట ముంచిన ఈదురు గాలులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అన్నాసముద్రం, రెడ్డిపల్లె తదితర గ్రామాలలో అకస్మాత్తుగా వీచిన ఈదురు గాలులు రైతులను నట్టేట ముంచాయి. ఇప్పటికే గతంలో భారీ ఈదురు గాలులు వర్షాలకు పంటలు నష్టపోయి కోలుకోలేని పరిస్థితిలో ఉన్న రైతన్నకు మరోసారి భారీగానే నష్టం వాటిల్లినట్టు సమాచారం. మండలం అనంతసముద్రం కు చెందిన ముద్ద శివశంకర్ రెడ్డి అనే రైతు యొక్క 11 ఎకరాలలో అరటి పంట ధ్వంసం అవడంతో దిక్కుతోచని స్థితిలో ఏం చేయాలో అర్థం కాక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాగా వేపుగా పెరిగిన పంట చేతికొస్తే ఆదాయం వస్తుందని ఆశతో ఉన్న రైతుకు అకస్మాత్తుగా వీస్తున్న ఈదురుగాలులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అనేకమంది రైతులు అరటి, బొప్పాయి పంటలను ఎదుగుతున్న దశలో నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకు పోయామని పంట చేతికి వచ్చినప్పుడల్లా ప్రకృతి కన్నెర చేస్తుండడంతో వ్యవసాయం అంటేనే రైతులు జడుసు కునే పరిస్థితి ఏర్పడింది. అనంత సముద్రం, రెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రాల పరిధిలో అధికారుల అంచనా ప్రకారం 117 ఎకరాల్లో అరటి పంటకి నష్టం వాటిల్లినట్టు ఉద్యాన శాఖ అధికారి జి.సురేష్‌బాబు తెలిపారు. **సుండుపల్లి :** మండలంలోని పెదనేని కాలువ గ్రామపంచాయతీ ఈడిగపల్లెకు చెందిన సుంకర రామకృష్ణయ్య కు చెందిన మామిడి చెట్లు ఈదరగాలుల ప్రభావానికి నేలకొరిగాయి. భారీగా మామిడికాయలు రాలిపోయాయి. ప్రతి ఏడాది మామిడి రైతులకు నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం అందక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా ప్రభుత్వ అధి కారులు నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి చాకలపల్లి, కుమ్మరపల్లి ఎగువమాలపల్లి, పోచం పల్లికి చెందిన ప్రజలు ప్రతినిత్యం వెళ్లే మెటల్ రోడ్డులో కరెంటు స్తంభాలు వంగిపోవడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో ప్రతినిత్యం ఆ రోడ్డుమీద కొత్తడ్లపల్లి రవీందర్ రెడ్డి కాలనీ సుమారుగా ఏడు గ్రామాల ప్రజలు సుండుపల్లికి ప్రతినిత్యం బయలుదేరి నిత్యవసర సరు కులను తీసుకుని వెళ్ళడానికి ఆ రోడ్డుపైన వెళుతూ ఉంటారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

సుండుపల్లి: ఒరిగిన విద్యుత్ స్తంభం

పుల్లంపేట : ఈదురు గాలులతో నేలకొరిగిన అరటి పంట

అభివృద్ధిని చూసి ఆదరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోమారు వైసిపిని ఆదరించాలని ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కోరారు. సోమవారం బిఆర్ గెస్ట్‌హౌస్‌లో ఎపిఎస్‌ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జున రెడ్డితో సమావేశం నిర్వమించారు. నియోజకవర్గం లో మారుమూల గ్రామాలకు బస్సు సర్వీసు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని, బి.కొత్తకోటలో డిపో ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో పర్యటించారు. సర్పంచ్ నీలూఫర్, మైనుద్దీన్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైసిపి గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధికి రెండు కళ్ళుగా భావించి పాలన సాగిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి ,సింగిల్ విండో చైర్మన్ భార్గవరెడ్డి ,సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్ ,మల్లయ్య కొండ చైర్మన్ మల్రెడ్డి పాల్గొన్నారు.

మండల పర్యటనలో ప్రజలతో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వాలంటీర్లు :'చింతల'

వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధుల్లా సేవలందిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన జాతి పిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా మన ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని అన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవ చేసే సదవకాశాన్ని ఎంతోమంది యువతకు కల్పించిన ఘనత కూడా ఈ ముఖ్యమంత్రికే దక్కుతుందని చెప్పారు. ఈ సచివాలయ వ్యవస్థలోనూ ప్రజల నుంచి పాలకుల వరకూ, అధికారుల నుంచి అధిష్టానం దాకా చెప్పే ఒకే మాట గ్రామ వాలంటీర్లని పేర్కొన్నారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తిస్తూ మూడవ ఏడాది కూడా విజయవంతంగా వారిని పురస్కారాలతో గౌరవిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

యోగేష్ బాబుకు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-పీలేరు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఎన్ఆర్ఐ స్కాలర్ గా సోమవారం పీలేరుకు చెందిన టి.యోగేష్‌బాబు పిహెచ్‌డి అందుకున్నారు. ప్రస్తుతం ఈయన సిబిఎస్ఎస్ అడికై, ఎరిత్రియ దేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ జి.అనిత పర్యవేక్షణలో "ఫోటోగ్రాఫిక్ కవరేజ్ డ్యూరింగ్ ది 2019 ఎలక్షన్స్, ఏ స్టడీ ఆఫ్ రీజినల్ తెలుగు న్యూస్ పేపర్స్" అంశంలో సమర్పించిన థీసిస్‌కు పిహెచ్‌డి ప్రకటించినట్లు రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. పిహెచ్‌డి పట్టా సాధించిన ఎన్ఆర్ఐ స్కాలర్ టి.యోగేష్ బాబును ఇంటర్నేషనల్ సెల్, డైరెక్టర్ ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ యోగేష్‌బాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

తంబళ్లపల్లి : వైఎస్ఆర్ క్రాంతి పథంలో పనిచేస్తున్న విఒఎలకు లోకోస్ యాప్ పై శిక్షణ ఇస్తున్నట్లు ఏరియా కో-ఆర్డినేటర్ సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో సోమవారం, మంగళవారం రెండు రోజులు పాటు రిసోర్స్ పర్సన్ మహమ్మద్‌బాషా శిక్షణ ఇస్తారన్నాని తెలిపారు. మొదటి రోజు యాప్ డౌన్లోడ్ చేసుకోవటం, వినియోగం అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపిఎం గంగాధర్, సిసిలు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై స్పందించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రభుత్వం అమలు పరుస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలపై విఆర్‌ఒలు స్పందించాలని తహశీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశం జరిగింది. ప్రజలకు అందుబాటులో ఉండి సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ రవి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

వైసిపిలో మైనార్టీలకు సముచిత స్థానం

- మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ అబ్దుల్

ప్రజాశక్తి - వేంపల్లె

ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ వైసిపి అని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ ముజీబ్ చెప్పారు. మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధిని సోమవారం ఆయన సందర్శించారు. ముందుగా వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్‌లో వైసిపి సేవాదళ్ అధ్యక్షుడు రఫి ఆధ్వర్యంలో అబ్దుల్ ముజీబ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ముజీబ్ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను సిఎం జగన్ గుర్తించి పదవులను కట్టబెట్టారన్నారు. సిఎం జగన్ వల్లే తనకు ఇంత గౌరవం దక్కిందని ఆయన తెలిపారు. ముస్లిం మైనార్టీ ప్రజల సంక్షేమం కోసం పని చేస్తానని పేర్కొ న్నారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ కార్యకర్తలు గౌస్‌పీర్, ఫిరోజ్, అమీర్ బాషా, ఇస్మాయిల్, అసిన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రాయితీతో వేరుశనగ కాయలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలో మంగళవారం నుండి 2023 ఖరీఫ్‌నకు సంబంధించి రైతులకు సబ్సిడీపై కె6 రకం వేరుశనగ కాయలు 40 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు ఎఒ పి.అరుణకుమారి తెలిపారు. ఒక రైతుకు అర ఎకరం భూమికి 30కిలోలు గల ఒక బ్యాగు, ఎకరం భూమికి రెండు బ్యాగులు, ఎకరానికి పైగా ఉన్న భూమికి మూడు బ్యాగులు వేరుశనగ కాయలు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. వేరుశనగ కాయలు వాస్తవ ధర ఒక బ్యాగు రూ.2,790కాగా రాయితీతో రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండు బ్యాగులకు రూ.3,348, మూడు బ్యాగులకు రూ.5,022 చెల్లించవలసి ఉంటుందని ఎఒ వివరించారు. అవసరమైన రైతులు సచివాలయ పరిధిలోని ఆర్‌బికెలో సంప్రదించాలన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు సిద్దయ్య తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిబిరాల్లో భాగంగా సోమవారం అందాల ఆవశ్యకత గురించి ఆయన వివరించారు. ప్రతి విద్యార్థి ఏదోక సమయంలో ప్రతిరోజు గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ ఉన్న ఎన్నో పుస్తకాలు చదవాలన్నారు. తద్వారా చాలా విషయాలు తెలుసుకోవచ్చునని సూచించారు. రాబోయే రోజుల్లో ఆ విజ్ఞానం మీకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, లైబ్రేరియన్ కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

25న గురివిరెడ్డి ప్రథమ వర్ధంతి సభ

పజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ఈ నెల 25న జరిగే సిపిఎం మాజీ మండల కార్యదర్శి కామ్రేడ్ యత్తపు గురివిరెడ్డి ప్రథమ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి సాన గోవింద్ కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమాన్ని సుందరయ్య కాలనీ దగ్గర ఏర్పాటు చేశామన్నారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బి.నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.శివకుమార్, హాజరు కానున్నారని తెలిపారు. మండలంలో సిపిఎం నిర్వహించిన అనేకప్రజాపోరాటాల్లో గురివిరెడ్డి తనదైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి గుర్రయ్య, అజయ్‌కుమార్, భాస్కర్, లక్ష్మి నారాయణ, రమణ, గురయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

వేంపల్లె : కేంద్ర, రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రాబోవుతునట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. స్థానిక సంఘం వీధిలో వైసిపికి చెందిన 10 కుటుంబాలు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వేమ య్య, బాలం సుబ్బరాయుడు, లోకేష్‌తోపాటు పలువురికి తులసిరెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేలూరు శ్రీనివాసులురెడ్డి కాంగ్రెస్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ వైసిపి నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పలువురు యువకులు రావడం సంతోషకరమన్నారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి వైసిపిలో ఉన్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధన కోసం కలిసికట్టుగా పని చేస్తామని తెలిపారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి చేరితే స్వాగతిస్తామని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ రావడం ఎపి ప్రజలు స్వాగతించారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, నరసింహరెడ్డి, శివ, నాగార్జున, చెన్నకేశవ, వేమయ్య, లోకేష్, మణికంఠ, వినయ్, శ్యాం, బద్రి, శివ, రవితోపాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి సిఐ ఆర్థిక సాయం

ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరు గ్రామంలో ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమానికి స్థానిక సిఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ కృష్ణయ్య రూ.20వేలు ఆర్థికసాయాన్ని సోమవారం ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్రకు అందజేశారు. ఆశ్రమ అభివృద్ధికి తమవంతు చిరు సాయంగా ఈ నగదును అందించినట్లు సిఐ తెలిపారు. ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్ర మాట్లాడుతూ ఆర్థిక సాయం అందించిన సిఐ, ఎస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత మజ్జిగ వితరణ

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

స్థానిక ఆర్ టిసి బస్టాండ్ ఆవరణలో ప్రజలకు, ప్రయాణికులకు కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ప్రజలు, ప్రయాణికులు వడ దెబ్బ బారిన పడకుండా తమకు చేతనైన సాయం అందిస్తున్నామని కాలభైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం అధ్యక్షులు రెడ్డయ్య తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు రామిరెడ్డి, నాగయ్య, లీలాకృష్ణ పాల్గొన్నారు.

భూమిపూజ నిర్వహిస్తున్న ఎంపిడిఒ సౌభాగ్యమ్మ

జగనన్న కాలనీలకు స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-నందలూరు

గ్రామపంచాయతీ పరిధిలో జగనన్న కాలనీ కొరకు సుమారుగా పదెకరాల స్థలాన్ని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సహకారంతో ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం 400 ఇళ్ల నిర్మాణానికి తహశీల్దార్ సదానందం, ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, హౌసింగ్ ఎఇ పెంచలయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పేదలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని సదుద్దేశంతో లేఅవుట్‌ను దుర్గాపురం దగ్గర స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, విఆర్ఒ రాజు, సర్వేయర్ వెంక టేష్, మండల కో-ఆప్షన్ సభ్యులు ఖలీంఖాన్, బిసి నాయకులు తుమ్మల శ్రీధర్‌గౌడ్, కనకయ్య పాల్గొన్నారు.

సందర్శకులతో కిటకిటలాడిన మల్లయ్యకొండ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేతమల్లికార్జున స్వామి ఆలయం సోమవారం భక్తులు, సందర్శకులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వందలాది మంది మల్లయ్య కొండ ను సందర్శించారు. స్వామి వారికి పూజారి ఈశ్వరప్ప మల్లికార్జునలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి ఎగువన ఉన్న గౌరమ్మ దేవి ఆలయంలో పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

బస్టాండ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేయండి : 'మేడా'

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలో ట్రాఫిక్ సమస్యలు దృష్ట్యా నూతన బస్టాండ్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేయాలని తహశీల్దార్ ను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆదేశించారు. సుండుపల్లిలో బస్టాండ్‌కు అనుగుణ అనుకూలమైనటువంటి ప్రభుత్వ స్థలాలను పరిశీలించి కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లాల్సిందిగా సూచించారు

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

మండలంలోని ఎంసిఆర్ కళ్యాణమండపంలో వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నారు. రాయవరం గ్రామ పంచాయతీలోని ఆర్ఒ వాటర్ ప్లాంట్ భూమిపూజ చేశారు. నూతనంగా నిర్మించే బస్టాండ్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు సర్పంచులు, జెసి, ఇన్‌ఛార్జిలు, కన్వీనర్లు, మండల అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని వాలంటీర్లను మంగళవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సన్మానించనున్నట్లు ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. వీరికి సేవామిత్ర పురస్కారంతో సన్మానించనున్నారు. మండలంలోని ఒకరికి వజ్ర పురస్కారం ద్వారా రూ.30వేలు, 5మందికి రత్నా పురస్కారం ద్వారా రూ.20వేలు, 231 మందికి సేవా మిత్ర పురస్కారం ద్వారా రూ.10వేలు మంజూరవుతుందన్నారు. నగదు వాలంటీర్ల ఖాతాల్లో త్వరలో జమవుతుందన్నారు.ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఎంపిపి కోరారు.

క్రైం కార్నర్

షార్ట్ సర్క్యూట్‌తో ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని మదనపల్లి రోడ్డు పాత పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ఎస్‌వి.ఆయేషా ఆస్పత్రిలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే ఆస్పత్రిలోని వెన్నెల మెడికల్ స్టోర్ పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని డాక్టర్, మెడికల్ స్టోర్ దుకాణ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవన ఆధారమైన మెడికల్ స్టోర్ మంటల్లో కాలిపోవడంతో మెడికల్ స్టోర్ యజమాని కన్నీటి పర్యంతమయ్యారు. తమను ప్రభుత్వం,అధికారులు ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై పోలీసులు,సంబంధిత అధికారులు వివ రాలు సేకరించి నష్టపరిహారం అంచనా వేయడం జరుగుతోంది.

నాటుసారా నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు...తవళం పంచాయితీ తవళం క్రాస్ చెందిన చిన్నపరెడ్డి నాటుసారాను అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం తవళం క్రాస్ సమీపంలో నాటు సారాను విక్రయిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి అతనిని అదుపు లోకి తీసుకొని అతని వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎవరైనా నాటు సారా తయారీ చేసినా, రవాణా చేసినా, విక్రయిం చినా కేసులు నమోదు చేసి, జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. **రామసముద్రం :** అక్రమంగా నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే పుంగనూరు మండలం పత్రపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప కుమారుడు బాలాజీ నాయక్ అను వ్యక్తి చింపరపల్లి దగ్గర 5 లీటర్ల నాటు సారా తీసుకొని వస్తుండగా ఆవ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించి, కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లపై ఎస్ఇబి దాడులు

ప్రజాశక్తి-కలికిరి

ఇసుక ట్రాక్టర్లపై ఎస్ఇబి దాడులు నిర్వహించి ఏడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఎస్ఇబి సూపరింటెండెంట్ మధు సూదన్, వాల్మీకిపురం సిఐ శివసాగర్, గురుప్రసాద్ మండలంలోని మహల్ ఇసుక రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్ల పై దాడి చేసి కలికిరి కృష్ణప్పకు అప్పగించారు. ఆయన ట్రాక్టర్ డ్రైవర్ దగ్గర ఉన్న ఇసుక రీచ్ బిల్లులు, ఇన్ వాయిస్‌లు పరిశీలించి అన్ని సక్రమంగా ఉండడంతో ట్రాక్టర్లను వారికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న ఎస్ఇబి అధికారులు